# అద్దం మీద ఆవగింజ

"ఈ ఎడ్రసు ఇంటికెళ్ళి ఆర్డర్ తీసుకో" - అన్నాడు ఫర్నిచర్ షాపు యజమాని ఎడ్రస్సున్న చీటీ అందిస్తూ.

గుండ్రని కళ్లద్దాల్లోంచి చీటీకేసొకసారి చూసి జేబులో పెట్టుకొన్నాడు సూర్యం.

చేస్తున్న పని ఆపుచేసి - స్కెచ్ బుక్కూ పెన్సిలూ, టేపూ తీసుకొని బయల్దేరాడు.

పొడుగాటి మనిషేమో - సన్నగా ఉన్నట్టు కనిపిస్తున్నాడు. మనిషిలో ఏదో నిర్లిప్తత. కాళ్లకున్న చెప్పులు అరిగున్నాయి. వేసుకొన్న బట్టలు మాసి ఉన్నాయి. గెడ్డం మాసి ఉంది. ఏదో పోగొట్టుకొన్నట్టుగా చూస్తున్న కళ్లు, నెరుస్తోన్న జుట్టు. నుదుటి మీద పద్దగీతలు చెబుతున్నాయి - అతను జీవితంలో ఎన్నో ఆటుపోట్లకి గురయిన వ్యక్తని.

కాలవ్వారనున్న పార్కు దగ్గరికొచ్చి ఆగాడు.




అమృతపాణి

సాయంకాలపు నీరెండ వెచ్చగా శరీరాన్ని తాకుతోంది. కాలవ మీంచి వీస్తోన్న గాలి బొగడపూల పరిమళాల్ని మోసుకొస్తోంది.

పార్కులో పిల్లలు ఆటలాడుకొంటున్నారు. తల్లులు సిమెంట్ బెంచీల మీద కూచుని పిల్లల్ని ఒక కంట కనిపెడుతూనే వులెన్ స్వెట్టర్లు అల్లుకొంటున్నారు. పిచికలు ఒకదాన్నొకటి తరుముకొంటూ కిచకిచలాడుకొంటూ చెట్ల చుట్టూ ఎగురుతున్నాయి.

వాతావరణం ఆహ్లాదకరంగా ఉంది.

జేబులోంచి చీటీ తీసి – ఎడ్రసు చూసి గతుక్కుమన్నాడు!

గోపీచంద్ ఆర్ట్ స్టూడియో, టాప్‌ఫ్లోర్, రాణిగారి మేడ, గాంధీనగరం.

ఇరవైఏళ్ల క్రితం తనున్న గది ఆ ఇంటి టాప్‌ఫ్లోర్‌లోనే. రెండుగదుల పోర్షనది. దాన్నే ఆర్ట్‌స్టూడియోగా మార్చి ఉంటారు.

నుదుట్ని చెమటలు పట్టాయి. కాళ్లు వణకడం మొదలుపెట్టాయి. వెనక్కి వెళ్ళిపోదామనుకొన్నాడు. అక్కడికి మరెవర్నయినా పంపించమని యజమానిని అడుగుదామనుకొన్నాడు.

కానీ – అంతలోనే అనిపించింది – మరీ సెంటిమెంటల్‌గా ఉండడం కూడా మంచిది కాదని. అప్రయత్నంగానే ముందుకు సాగాడు.

ఎదురుగా ఉన్న సందులోంచి వెళ్ళి తాలూకా ఆఫీసువీధి వైపుకి తిరిగాడు. కొద్దిదూరం నడిచి మూడంతస్తుల పాతకాలపు మేడ ముందు ఆగాడు.

ఎస్టేట్లు పోని క్రితం – లక్ష్మీపురం రాణీగారు కట్టించిన మేడ అది – ఆవిడ హోదాకి తగ్గట్టుగా చాలా ఖర్చు పెట్టి కట్టించారా భవంతిని. కానీ ఉన్న ఆస్తంతా దర్జాలకని, దానధర్మాలకనీ ఖర్చు పెట్టెయ్యడంతో – ఎంతో ముచ్చటపడి కట్టించుకొన్న మేడకూడా ఒక మార్వాడీకి అమ్ముకోవాల్సి వచ్చిందావిడకి!

ఇల్లు చేతులు మారినా అందరూ దాన్ని రాణీగారి మేడనే అంటూంటారు.

పెద్ద పెద్ద అక్షరాలతో సైన్ బోర్డ్లు కనిపిస్తున్నాయి. కిందతస్తులో బాటాషూస్ కంపెనీ షాపుంది. పై అంతస్తులో డెంటిస్ట్ క్లినుక్కుంది. ఆపై అంతస్తులో ఫిల్మ్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫీసుంది. టెర్రేస్ మీదున్న రెండు గదుల పోర్షన్‌లో ఆర్ట్ స్టూడియో ఉంది.

వచ్చేపోయే జనాలతో ఆ ప్రాంతమంతా చాలా హడావుడిగా ఉంది. హాలుకి ఒకపక్కన వర్తులాకారంలో అందంగా కట్టిన మెట్లున్నాయి. మార్బుల్ ఫ్లోరింగ్ చెక్కు చెదరకుండా ఇంకా అలానే ఉంది.

మెల్లిగా ఎక్కుతున్నాడు ఒక్కొక్కమెట్టూ.

అప్పట్లో అయితే హుషారుగా నాలుగు నిమిషాల్లో ఎక్కేసి, తన పోర్షన్ తలుపు తట్టేవాడు. తలుపు తట్టడమే – గబుక్కునొచ్చి తలుపు తీసేది రజని!

ఇప్పుడు రజనేది? ఎక్కడుంది?

* * *

సూర్యం పూర్వీకులు ఒకప్పుడు బాగా ఉన్నవాళ్లే. రానురాను రకరకాల కారణాల వల్ల చితికిపోయారు. సూర్యం తండ్రి దగ్గరికి వచ్చే సరికి కుటుంబం ఆర్థికంగా బాగా దెబ్బతింది. అప్పుల్లో కూరుకుపోయిన అతని తండ్రి ఏం చేయాలో పాలుపోక ఆత్మహత్య చేసుకొన్నాడు. అంతకుముందే అతని తల్లి చనిపోయింది.

ఉన్న ఊళ్లో ఉండలేక – విజయవాడకొచ్చి – ఫర్నిచర్ షాప్‌లో పనివాడుగా చేరాడు.

కష్టపడి పనిచేసి వడ్రంగంలోని మెళుకు

వలన్నీ నేర్చుకొన్నాడు. పనిలో చేరిన కొద్ది కాలానికే – బీరువాలు, సోఫాసెట్లు, దివాన్లు, టేబుల్స్, చెయిర్స్ రకరకాల డిజైన్స్‌లో చేయ డంలో అందెవేసిన చేయనిపించుకొన్నాడు!

ఫర్నిచర్ షాప్ యజమాని అతని పనిత నానికి మెచ్చి నెలకి అయిదువేల దాకా ఇవ్వడం మొదలుపెట్టేడు!

సరిగ్గా ఆ సమయంలోనే క్లాత్‌షాప్‌లో సేల్స్‌గర్ల్‌గా పనిచేస్తున్న రజనితో పరిచయం గావడం – పరిచయం ప్రేమగా మారడం – ప్రేమ పెళ్లికి దారితియ్యడం జరిగింది! అప్ప టికే కొంత డబ్బు కూడబెట్టిన అతను – రజని తో దర్జాగా బతకొచ్చన్న ఆలోచనతో – అద్దె ఎక్కువే అయినా – రాణీగారి మేడ టెర్రేస్ మీదున్న రెండుగదుల పోర్షన్ని అద్దెకు తీసు కొన్నాడు.

పేరుకి రెండుగదుల పోర్షనే అయినా సకల సదుపాయాలూ ఉన్న పోర్షనది. ఉన్న రెండు గదులూ విశాలమైనవి. పెద్ద పెద్ద కిటికీల్లోంచి గాలీ, వెలుతురూ పుష్కలంగా వస్తూండేవి. సాయంత్రం పూట ఇవతలికొచ్చి నుంచుంటే ఊరంతా అందంగా కనిపించేది!

ఆ పోర్షన్లో రజనితో అయిదు సంవత్సరాల పాటు గడిపాడు. ఆ అయిదు సంవత్సరాల కాలంలో ఆమె సహచర్యంలో అతను పొంది నంత ఆనందం, సుఖం అంతా ఇంతా కాదు.

కానీ – చిత్రం ఏమిటంటే ఆ విషయం అతనికి తెలియదు!

ఆ అయిదు సంవత్సరాల కాలంలో అతను ఆమెతో దెబ్బలాడని రోజుకూడా లేదు.

చిన్న చిన్న విషయాల గురించి వాదించు కోవడం మొదలుపెట్టి – నువ్వెంతంటే నువ్వెం త అనుకొనే దాకా వెళ్లేవారు. మాటలతో సరి పెట్టుకొంటే పరవాలేదు. రక్తం మరీ ఉడికెత్తి నప్పుడు చేతలదాకా వెళ్లేవారు!

అతని వృత్తిని గురించిగానీ అతని కుటుం బాన్ని గురించిగానీ ఆమె చులకన చేసి మాట్లా డినప్పుడు – అతను ఉద్రేకాన్ని ఆపుకోలేక ఆమె జుట్టట్టుకొని కొట్టడానికి ప్రయత్నించేవాడు. తనేం తక్కువ తినలేదన్నట్టుగా ఆమె కూడా అతణ్ణి రక్కడానికో, తన్నడానికో ప్రయత్నించేది! దెబ్బలాడ్డానికి ఏమాత్రం ఓపిక లేనప్పుడు నిస్సహాయంగా ఏడుస్తూ కూర్చునేది. అలా కా కుండా ఇంకా ఏ మాత్రం ఓపికున్నా – 'మీతో నేను కాపురం చేసేది లేదు. నేన వెళ్తున్నా–' అంటూ ఇల్లు విడిచివెళ్లిపోయేది.

కానీ ఆమె తిరిగి వెనక్కి వచ్చేది.

అలా జరగనప్పుడు – అతనే ఆమెని వెదు క్కుంటూ బయల్దేరేవాడు. చివరికి ఏ పార్కులో నో కనిపించేది. ఆమెను బుజ్జగిస్తూ మాట్లా డుతూ – తప్పంతా తనదే క్షమించమని అడిగే వాడు. ఐస్క్రీంలా కరిగిపోయేదామె. 'అంత మాటనకండి... నేనే తప్పుగా మాటాడాను! అనేది. ఆ తర్వాత ఇద్దరూ వెల్‌కమ్ హోటల్లో భోంచేసి సెకండ్‌షో సినిమాకెళ్లేవారు.

విపరీతమైన వ్యక్తిత్వాలు, విచిత్రమైన మన స్తత్వాలు. దాంపత్య జీవితంలోని సౌఖ్యాల్నీ ఆనందాల్నీ అనుభవిస్తూనే ఒకరి మూలంగా మరొకరు సుఖసంతోషాల్ని పోగొట్టుకొంటున్న ట్టుగా అనుకొనేవారిద్దరూ!

ఆమె తనకి గుదిబండలా తయారయిందని అతనసుకొంటే – అతను తనకి శనిలా దాప రించేడని ఆమె అనుకొనేది. వాళ్ల తగాదాలకీ రకరకాల కారణాలు...

ఆడది ముందు పుట్టి అనుమానం తర్వాత పుట్టిందంటారు. లాండ్రీ లావణ్యతో అతనికి సంబంధం ఉందని ఆమె అనుమానం.

ఆ విషయం గురించి – ఒకరోజు – అత

నితో దెబ్బలాటేసుకొంది. అంతతో ఊరుకో కుండా - నేరుగా లాండ్రీకెళ్లి - లావణ్యతో తగవు పెట్టుకొంది. తన మొగుడితో సంబంధం కట్ చేయకుంటే ఆమెని చంపుతానని బెదిరించింది.

విషయం తెలుసుకొన్న సూర్యం ఆమెని నిలదీసి అడిగాడు.

"ఏమిటీ పిచ్చి పిచ్చి వేషాలేస్తున్నావ్?"

"ఏవి చేశానూ?"

"లాండ్రీ కెళ్లి నానా రభసా చెసావుటా?!"

"చేస్తే ఏంటటా?!-"

"ఏంటా?!- నా ప్రిస్టేజి గంగలో కలిపావ్!"

"మీకు ప్రిస్టేజొకటా?!"

మాటా మాటా పెరిగి - తారాస్థాయికి చేరింది గొడవ.

పురుషాహంకారం దెబ్బతినడంతో "ఊరుకొంటే మరీ రెచ్చిపోతున్నావ్! చూడు నిన్నేం చేస్తానో-" అంటూ రెండు చేతుల్తోనూ ఆమె పీకని పట్టుకొని నొక్కడం మొదలుపెట్టేడు.

ఆమెకి ప్రాణం పోతోందన్నట్టనిపించింది! అయినా బలాన్ని కూడగట్టుకొని - చేతిలో ఉన్న గరిటెతో అతని నెత్తిమీద బలంగా ఒక దెబ్బ కొట్టింది.

ఆ దెబ్బకి అతనికి దిమ్మతిరిగినట్టయి పోయింది.

గబుక్కున ఆమె పీకవదిలి "నీకు పిచ్చెత్తిందా?" అన్నాడు కోపంగా.

"పిచ్చెత్తింది నాక్కాదు. మీకూ-" అందామె.

తలక్కట్టిన బొప్పిని తడుముకొంటూ "నీకింత తల పొగరా? ఫో - నా ఇంట్లోంచి ఫో" - అన్నాడు గద్దిస్తున్నట్టుగా.

"వెళ్తాను. మళ్లీ వెనక్కిరాను" అంటూ ఆమె చరచరా నడుచుకొంటూ వెళ్లిపోయింది.

అలా వెళ్లినామె మళ్లీ తిరిగిరాలేదు.

తెగ వెదికాడతను - ఎక్కడయినా కనపడుతుందేమోనని.

కానీ - ఆమె కనపళ్లేదు!

ఇంక ఆ పోర్షన్లో ఉండబుద్ధి కాలేదు.

ఖాళీ చేసి - మాచవరం కొండవారనున్న పెంకుటింటి పోర్షన్‌కి మారాడు. అప్పటికి - ముప్పైమూడు సంవత్సరాలు అతనికి.

మొదట్లో - ఆమెలేకపోతే వచ్చిన నష్టమేమిట్లే - అనుకొన్నాడు.

ఆమెని మరిచిపోటానికని - ఫర్నిచర్ షాప్‌లో మరింత ఎక్కువగా పనిచేయడం మొదలుపెట్టాడు.

కానీ - ఒంటరితనం వేధించడం మొదలుపెట్టింది!

సరిగ్గా ఆ సమయంలోనే - ఒకామె తగులు కొందతణ్ణి!

వయసులో అతనికంటే కొద్దిగా పెద్దదామె. ఇద్దరు పిల్లలున్నారు. మొగుడు మిలటరీలో పనిచేసేవాడని, యుద్ధంలో చనిపోయాడనీ బుడిబుడి దుఃఖాలు పోతూ చెప్పి అతణ్ణి నమ్మించింది. ఆ ఇంట్లో ఇల్లాలికి మల్లేనే తిష్ట వేసింది!

అతనంటే అగ్గగ్గలాడిపోతున్నట్టు నటిస్తూనే - అతణ్ణి తన పూర్తి ఆధీనంలోకి తెచ్చుకొంది.

అతను గడించిన డబ్బంతా ఆమె చేతిలో పొయ్యాలి. ఆ డబ్బుని ఆమె ఎలా ఖర్చుపెట్టినా ఎంత ఖర్చు పెట్టినా అడగడానికి వీల్లేదు.

పోనీ ఎలాగో అలాగ సద్దుకుపోదామనుకుంటే ఆమె బంధువులమంటూ రిఫ్‌రేఫ్‌గా ళ్లొచ్చి ఇంట్లో తిష్టవేసుక్కూచుంటారు. వాళ్ళకి

రాచమర్యాదలు చేస్తూ కాలక్షేపం చేస్తూంటుం దామె. అలా ఎందుకు చేస్తున్నావని అడిగితే - కస్సుమని లేస్తుంది.

'వాళ్ళు నాక్కావలసినోళ్లు - ఇష్టం లేకపోతే చెప్పు వెళ్లిపోతాను - అని బెదిరిస్తుంది. ఏం చెప్పలేక నోరు మూసుకొంటాడతను.

రోజులు భారంగా గడుస్తున్నాయి...

రోజులు వారాలుగా-వారాలు నెలలుగా -నెలలు సంవత్సరాలుగా మారిపోతున్నాయి.

జీవితం నిస్సారంగా గడుస్తోంది...

మనిషి నిర్లిప్తంగా మారిపోయాడు.

ఏదో చేయాలనే తపన, ఏమీ చేయలేని అశక్తత.

పూర్వానికి మల్లే పనిపట్ల ఉత్సాహం చూపించడంలేదు. యాంత్రికంగా చేస్తున్నాడు తనకిచ్చిన పనిని.

చూస్తూండగానే - నలభై సంవత్సరాలు దాటాయి.

ఆమెతో కలిసి ఉండడం అసాధ్యం అని పించింది. కొసకో నిర్ణయం తీసుకొన్నాడు. కొంత డబ్బిచ్చేసి - ఆమెను వొదుల్చుకొన్నాడు.

ఇల్లు మారిపోయాడు. ఫర్నిచర్ షాప్‌కి దగ్గిరగా రూమ్ తీసుకొన్నాడు.

మళ్లీ ఒంటరితనం.

మళ్లీ మరోలంపటం తగిలించుకోవడం ఇష్టం లేక - అలాగే గడిపేయడం మొదలు పెట్టేడు.

వేసుకొన్న దుస్తుల్ని గురించిగానీ - కనపడే పద్ధతి గురించి గానీ - ఆలోచించడం ఎప్పుడో మానేశాడు. నిరాసక్తంగా ఉండడానికి అల వాటుపడిపోయాడు.

రజనీని దాదాపుగా మరిచిపోయాడు.

కాలచక్రం తిరుగుతూనే ఉంది... చూస్తోం డగానే- మరో అయిదు సంవత్సరాలు గడి చాయి!

ఇదిగో - ఇప్పుడిలా - ఫర్నిచర్ షాప్‌కి ఆర్డర్‌బుక్ చేయడానికి - ఒకప్పుడు తనున్న పోర్షన్‌కే వెళ్ళవలసి రావడంతో - గతించిన జీవితంలోని సంఘటనలు - వాటి తాలూకు జ్ఞాపకాలు - కదిపిన తుట్టలోని తేనెటీగలకి మల్లే - అతని మస్తిష్కంలో కదలాడాయి.

చివరి మెట్టు ఎక్కి - కాలింగ్ బెల్ నొక్కాడు.

ఒకతనొచ్చి తలుపు తీసి "ఎవరు కావాలి మీకు?" అనడిగాడు.

"నేను కార్పెంటర్‌ని. టేబిలేదో చెయ్యాల న్నార్టా?" అన్నాడు.

"ఓ - రండి. లోపలికి రండి" అన్నాడతను.

పాతిక సంవత్సరాల యువకుడతను.

అతనే ఆర్టిస్ట్ గోపీచంద్ అయ్యుండాలి.

తనున్న పోర్షనే అది!

అయితే - అందంగా తీర్చిదిద్దారు. నేల మీద ఎట్టటి ఖరీదయిన తివాసీ పరిచారు. కిటికీలకి అందమయిన కర్టెన్స్ కట్టారు. ఖరీ దయిన సోఫాల తోటి, ఫర్నిచర్ తోటీ రూమ్ కళకళ లాడిపోతోంది.

సీలింగ్ నుంచి అందమయిన షాండ్లియర్లు వేలాడుతున్నాయి!

కిటికీకి పక్కగా ఉన్న ఈజిల్ మీద సగం పూర్తయిన చిత్రం ఉంది. గోడలు రంగు రం గుల చిత్రపటాలతో అలంకరించబడ్డాయి.

ఇంగ్లీషు మేగజైన్ నుంచి ఒక పేజీ చింపి సూర్యానికిస్తూ...

"ఈ పేజీలో ఉన్న టేబుల్‌ని చూశారు కదా

– నాకిలాంటిది చేసి పెట్టాలి" అన్నాడతను.

ఆ బొమ్మకేసి పరీక్షగా చూశాడు.

అతని కళాత్మకతకి మనసులోనే జోహార్లు అర్పించుకొన్నాడు. అద్భుతమైన పనితనం ఉన్న టేబులది! ఇటూ అటూ మడతపెట్టడానికి వీలైన టేబులది! పూర్వం ఉన్నత వర్గాలవారు ఉపయోగించేవారు ఆ రకమయిన టేబుల్స్‌ని.

సూర్యం అడిగాడు "చక్కటి టేబులిది! టేకుతో చేయమంటారా? రోజ్‌వుడ్‌తో చేయమంటారా?"

అలా అడుగుతూనే సోఫా మీద తెరిచున్న సూట్‌కేస్‌ని చూశాడు.

ఒక ఇరవైఏళ్ల అమ్మాయి – అందగత్తె అనే చెప్పాలి! – బహుశా అతని భార్య అయ్యుండాలి – అందులో బట్టలు సర్దుతోంది.

అతనామెకేసి చూస్తూ "రోజ్‌వుడ్డో – టేక్‌వుడ్డో – మంచి క్వాలిటీది ఉపయోగించండి" అన్నాడు.

తర్వాత ఆమెతో కోపంగా అన్నాడు "నీ నాటకాలు కట్టిపెట్టి – పెట్లో సర్దుతున్న బట్టల్ని బీరువాలో పెట్టు".

"నావేం నాటకాలు కావు... నేను వెళ్తున్నానని చెప్పాను కదా–" అందామె అతనికేసి చురచురా చూస్తూ.

"నువ్వెళ్లటం లేదు. నీ డ్రామా కట్టిపెట్టు" అన్నాడతను అరిచినట్టుగా.

"డ్రామాయోకాదో – మీకే తెలుస్తుంది కొద్దిసేపట్లో–" ఆమె సూట్‌కేస్‌లో బట్టలు పడేస్తూ అంది.

భార్యాభర్తల మధ్య తగువులాటన్న మాట!

వాళ్ల గురించి పట్టించుకోనట్టుగా – సూర్యం స్కెచ్ బుక్కు, పెన్సిలూ తీసుకొని టేబుల్ బొమ్మగీయడం మొదలుపెట్టేడు.

అతనేం చేయాలో తెలియక – ఆమెకేసి కోపంగా చూస్తూ అటూ ఇటూ నడవడం మొదలుపెట్టేడు.

తర్వాత – ఒక చాకు తీసుకొని – ఈజిల్ మీదున్న – సగం పూర్తి చేసిన చిత్రాన్ని చింపేశాడు! ఆ తర్వాత – ఈజిల్‌ని ఒక తన్ను తన్నటంతో – అది కింద పడిపోయింది.

అతను చేస్తోన్న హంగామాని గమనిస్తున్న ఆమె "డ్రామా ఆడుతోన్నది మీరో – నేనో – తెలుస్తూనే ఉందిగదా – ఏదో అద్భుతమైన కళాఖండాల్ని చింపేసినట్టుగా మాత్రం పోజు పెట్టకండి" అంది.

సూర్యానికి గుర్తుకొచ్చింది – రజని కూడా తన పనితనాన్ని వేళాకోళం చేస్తూ ఇలాగే తనని రెచ్చగొట్టడం!

అయినా – వాళ్ల గురించి పట్టించుకోనట్టుగా – టేబుల్‌కి సంబంధించిన వివిధ భాగాల్ని గీయడం మొదలుపెట్టేడు.

టేబుల్ని పెద్దది చేసుకోవాలంటే – ఇటూ అటూ మడిచిన భాగాల్ని పైకెత్తి – వాటిని కదపటానికి వీలయిన విధంగా అమర్చిన కాళ్ల మీద ఆనుకొనేటట్టు చేస్తే చాలు. ఎంత చక్కటి ఏర్పాటు! ఒక్కొక్క విభాగానికి సంబంధించిన కొలతల్ని నోట్ చేసుకొంటున్నాడు.

ఆమె అంటోంది – "అలా ఆ చిత్రాన్ని చింపి పాడుచేసే కంటే ఇలా వచ్చి ఈ సూట్‌కేస్‌ని మూయ్యొచ్చుగా–"

అతనామెకి సహాయం చేయడానికన్నట్లుగా వెళ్లి – సూట్‌కేస్‌ని రెండు చేతుల్తోనూ పైకెత్తి – గది మధ్యకి పడేటట్టు విసిరి "చాలా? ఇంకా ఏమన్నా చేయాలా?" అన్నాడు నిర్లక్ష్యంగా.

ఆమె బట్టలన్నీ నేలమీద చిందరవందరగా పడున్నాయి.

ఆమె చాలా ప్రశాంతమైన స్వరంతో "వాటిని తియ్యండి" అంది.

"నాకేం పట్టింది వాట్ని తియ్యడానికి?" అన్నాడు ఆమె అంటే ఏం లెక్కలేనట్టుగా.

ఆమె చిన్నబుచ్చుకొంది.

సూర్యం వాళ్లిద్దరికేసీ జాలిగా చూశాడు.

ఒకప్పుడు - ఇదే పోర్షన్లో - ఇదే గదిలో - తనకీ రజనీకి మధ్య ఎన్నో గొడవలు జరిగాయి.

పరస్పరం ప్రేమాభిమానాలుండికూడా చిన్న చిన్న విషయాలకి గొడవలు పెట్టుకొని - కొసకి విడిపోవడం జరిగింది.

వీళ్లిద్దరికీ కూడా పరస్పరం ప్రేమాభిమానాలు ఉండే ఉంటాయి. కానీ ఆ విషయం గురించి మరిచిపోయి - పంతాలకి, పట్టింపులకీపోయి - పండంటి కాపురాన్ని పాడు చేసుకోడానికి సిద్ధపడుతున్నారు.

అలా జరక్కూడదనుకొన్నాడు సూర్యం మనస్ఫూర్తిగా.

అతనికేసి చూస్తూ "ఏ రకం కఱ్ఱతో దాన్ని చేయాలో చెబితే నేను వెళ్తాను" అన్నాడు గంభీరమైన స్వరంతో.

"టేబుల్ని చక్కగా మీక్కావలసినట్టుగా చేయించుకోండి. నేనిక్కడ ఎలాగూ ఉండేది లేదుగా-" అంటూ ఆమె సోఫాలో కూలబడి భోరుమని ఏడవడం మొదలుపెట్టింది.

చూస్తోండగానే వాతావరణం మారిపోయింది. అతనికి ఉన్నట్టుండి ఆమెపై జాలి పుట్టుకొచ్చింది...

ఆమె దగ్గరికెళ్లి పక్కనే కూచుని - ఆమెని దగ్గరికి తీసుకొని "ఏడవకు నీలిమా - ఏడవకు. తప్పంతా నాదే. ఇలా ఎప్పుడూ ప్రవర్తించను. నన్ను క్షమించు" అన్నాడు ఆమె కన్నీళ్లు తుడుస్తూ.

ఆమె అతని బాహువుల్లో గువ్వ పిట్టలా ఒదిగిపోయింది.

సూర్యానికి గుర్తుకొచ్చింది. తనూ రజనీ హోరాహోరీగా దెబ్బలాడుకోవడం - దెబ్బలాడి దెబ్బలాడి - అలిసిపోయి - ఇంకేం చేయలేక - రజని మొహం చేతుల్లోదాచుకొని ఏడవడం - తను ఆమెను దగ్గరికి తీసుకొని సముదాయించడం.

ఆమెను సముదాయిస్తూనే అతనన్నాడు "టేబుల్ టేక్ వుడ్‌తోనే చేయండి. ఓ.కే.?-"

"సరే- సరే- పొడవెంత ఉండాలో వెడల్పెంత ఉండాలో కూడా చెప్పండి. ఒక మోస్తరుగా ఉండాలంటే మీటరున్నర పొడుగూ డెబ్బై ఐదు సెంటీమీటర్ల వెడల్పూ ఉంటే సరిపోతుంది. ఇంకా పెద్దది కావాలంటే చెప్పండి" అన్నాడు.

"మీరిప్పుడు చెప్పిన కొలతలు పెట్టి చేయండి. సరిపోతుంది" అన్నాడతను ఆమెను సముదాయిస్తూనే.

ఆమె కూడా మెత్తబడినట్టే కనబడింది.

"సరే వస్తాను. మీరు చెప్పినట్టే చేస్తాను" అని సూర్యం వెళ్లిపోతూంటే -

ఆమె ఏడుపు జీర మిగిలి ఉన్న కంఠస్వరంతో - ఆజ్ఞాపిస్తున్నట్టుగా అంది "చెప్పండాయనికి... టేబులు టేక్‌వుడ్‌తో కాకుండా రోజ్‌వుడ్‌తోనే చేయాలని".

"అలాగే- అలాగే-" అని ఆమెకి చెప్పి - సూర్యంతో "విన్నారుగా - రోజ్‌వుడ్‌తోనే చేయండి" అన్నాడతను.

"సరే- సరే-" అని తలపంకించి అవతలికి అడుగుపెట్టాడు సూర్యం. అప్రయత్నంగా ఒక చిరునవ్వు మెరిసిందతని పెదవులపై. ●